క్లుప్తంగా

కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం

ముప్పాళ్ళ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశ, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ముప్పాళ్లలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సేవ్ ఇండియా–సేవ్ అగ్రికల్చర్ నిరసన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల నుంచి పన్నుల రూపంలో దోచుకొని కార్పొరేట్లకు దోచిపెడుతుందన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందన్నారు. కార్మికులు ఎంతో కష్టపడి సాధించుకున్న కార్మికచట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చిందని దానిని వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు పండించిన పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చట్టం చేయాలని, కేంద్రం తెచ్చిన విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు తౌరటిఅమరలింగేశ్వరరావు, గారా జాలయ్య, ఇందూరి వెంకటరెడ్డి, పఠాన్ సైదాఖాన్, నరసింహారావు, తోట వెంకటేశ్వర్లు, గొల్లప్రోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనల మేరకే కలుపు మందులు వాడాలి

అమరావతి: మండలంలోని రైతాంగం కలుపు నివారణకు నిపుణుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి అహ్మద్ తెలిపారు. బుధవారం ఆయన రైతులకు సూచనలిస్తూ కలుపు నివారణకు మందులు వేసినప్పటికీ వ్యవసాయ పనిముట్ల ద్వారా అంతర కృషి చేయటం మంచిదన్నారు. పంటకు సరిపోయే కలుపు మందులు సరైన మోతాదులో సరైన సమయంలో వాడాలన్నారు. మెట్టసాగులో కలుపు మందులు పిచికారీ చేసుకోవాలని వరి పొలంలో మాత్రం కలుపు మందులు ఇసుకతో కలిపి చల్లాలన్నారు. కలుపు మందులు పవర్ స్ప్రేయర్‌తో కాకుండా హ్యాండ్ స్ప్రేయర్‌తో మాత్రమే పిచికారీ చేయాలన్నారు. ఫ్లడ్‌జెట్, ఫ్లాట్‌ఫెన్ నాజిల్‌తో కలుపుమందులు పిచికారీ చేయాలన్నారు. బాగా పదును ఉన్నప్పుడు కలుపు మందులు చల్లాలని, కనీసం 6 గంటలైనా వర్షం రాకుండా ఉండే సమయంలోనే కలుపు మందులను చల్లాలన్నారు. ఎక్కువ వేడి ఉన్నప్పుడు మందును చల్లకుండా ఉదయం గాని, సాయంత్రం గాని పిచికారీ చేయాలని, మందువాడిన స్ప్రేయర్‌ను శుభ్రంగా నాలుగు సార్లు కడగాలని సూచించారు.

మూడు నామినేషన్‌లు దాఖలు

రాజుపాలెం: మండలంలో బ్రాహ్మణపల్లి, అనుపాలెం, కొత్తభోదనం, చౌటపాపాయపాలెంల గ్రామాలలో వార్డు మెంబర్లకు జరిగే ఎన్నికలకు బ్రాహ్మణపల్లి, అనుపాలెం, చౌటపాపాయపాలెం, గ్రామాలలో ఒక్కో నామినేషన్ దాఖలైంది. కొత్త భోదనంలో ఇంతవరకు ఎవ్వరు నామినేషన్ వేయలేదు. నేటితో నామినేషన్‌ల గడువు ముగియనుంది.

8వ వార్డుకు నామినేషన్ దాఖలు..

పెదకూరపాడు: మండలంలోని బుస్సాపురం గ్రామంలో 8వ వార్డుకు ఒక నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. బత్తుల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేసినట్లు వెల్లడించారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అచ్చంపేట: గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్యామల సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఆమె గర్భిణులకు పరీక్షలు నిర్వహించి బిడ్డ ఎదుగుదలకు, రక్తహీనతగలవారికి విటమిన్ టాబ్లెట్ పంపిణీ చేశారు. అదేవిధంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా అన్ని పాఠశాలలో, జూనియర్ కళాశాలలో చదివే బాల బాలికలందరికీ గురువారం ఆల్బెండజోల్ టాబ్లెట్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

నేడు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ

పెదకూరపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన 8, 921 మంది విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు 75 త్యాళ్లూరు పీహెచ్‌సీ అధికారిణి డాక్టర్ ప్రియాంక, డాక్టర్ వెలుగొండారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం, ప్రైవేటు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్, దిలీప్ పాల్గొన్నారు.

300 మందికి ఉచిత వైద్యపరీక్షలు

క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు పంచాయతీ సచివాలయం వద్ద గుంటూరు కాటూరి మెడికల్ కాలేజీ, హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు.ఈకార్యక్రమంలో 300 మంది రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల వైద్యులు ముకుల్, శ్రీకర్, నౌరీన్, బ్యూలా పాల్గొని అన్ని రకాల రోగాలకు పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ మస్తాన్, పంచాయితీ కార్యదర్శి పంతులు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

జాషువా సాహిత్యం అజరామరం

- గుర్రం జాషువా పల్నాడు జిల్లా వాసి కావటం మన అదృష్టం
- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు
- వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం


బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: గుర్రం జాషువా పల్నాడు జిల్లా వాసి కావటం మన అదృష్టమని, అజరామరమైన ఆయన సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరత అందరిపై ఉందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గుర్రం జాషువా సాహితీ సేవాసంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో జాషువా జీవితం, సాహిత్యం అనే అంశంపై ఇటీవల వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఆ పోటీల్లోని విజేతలకు బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో చేపట్టిన బహుమతుల ప్రదానంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పోటీలలో వివిధ పాఠశాలల నుంచి 116 మంది విద్యార్థులు పాల్గొనగా శ్రీ సరస్వతి శిశుమందిర్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల, సత్తెనపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థినులు హర్షిణి ప్రథమ బహుమతిని, నిహారిక, వైష్ణవిలు కన్సోలేషన్ బహుమతులను సాధించారు. వారిని మంత్రి అంబటి రాంబాబు అభినందించి, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మక్కెన అచ్చయ్య, శ్రీ గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ వ్యవస్థాపకుడు పి.యిరీమ్మియా, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరావు నాయక్, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్, వల్లెం నరసింహారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

మాతృభూమి రుణం తీర్చుకోవాలి

పలు గ్రామాల్లో నా భూమి –నా దేశం


నర్సింగపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏపీఓ రామకృష్ణ

నకరికల్లు: ప్రతి గ్రామంలో 75చొప్పున మొక్కలు నాటి పుట్టినగడ్డ రుణం తీర్చుకోవాలని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆజాదీకా అమృత్ దినోత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని త్రిపురాపురం, నర్సింగపాడు, బాలాజీనగర్ తండా, నకరికల్లు, గుండ్లపల్లి గ్రామాల్లో బుధవారం నా మట్టి–మాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను జాతీయజెండాను ఎగురవేసి స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ శిలాఫలకం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్య్రం వచ్చి 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి గ్రామంలోను 75 చొప్పున మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏపీఓ రామకృష్ణ, ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో...

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు, బొల్లవరం, చాగంటివారిపాలెం గ్రామాల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు బుధవారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆయా గ్రామాల్లో శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. నా దేశం–నాభూమి ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు.జడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి పాల్గొన్నారు.

పెదకూరపాడు: అమరవీరుల స్మారకార్థం మండలంలోని పెదకూరపాడు, పరసర, లింగంగుట్ల గ్రామాల్లో నా భూమి – నాదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. వారి స్మారకార్థం దేశం కోసం యుద్ధభూమిలో పోరాడి మరణించిన వారి పేర్లు శిలాఫలకాలపై లిఖించనున్నట్లు వెల్లడించారు.

స్వాతంత్య్ర స్ఫూర్తిని నింపేందుకే...

సత్తెనపల్లి: దేశానికి స్వాతంత్రం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గత ఏడాది హర్ ఘర్ తిరంగా పేరిట ప్రతి ఇంటిపై జాతీయ జెండాను రెపరెపలాడించడం జరిగిందని సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి సుధాకర్ చెప్పారు. మండలంలోని ధూళిపాళ్ల, ఫణిదం, అబ్బూరు, గుజ్జర్లపూడి, పాకాలపాడు గ్రామాల్లో బుధవారం నా భూమి – నా దేశం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అందరిలో స్వాతంత్ర స్ఫూర్తిని నింపిన ప్రభుత్వం ఈ ఏడాది నా భూమి –నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం పేరిట ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో ర్యాలీలు నిర్వహించి స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పచ్చదనం పరిశుభ్రత లో భాగంగా మొక్కలు నాటారు. శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ జీవీ సత్య నారాయణ మాట్లాడుతూ ఈ నెల 16 వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. సత్తెనపల్లి క్లస్టర్ ఏపీడీ పి.వెంకటనారాయణ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, స్థానికులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సు చిన్నారులకు రక్ష



సత్తెనపల్లి: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం చిన్నారులకు రక్షణగా ఉంటుందని ఏఎన్ఎం కె.అన్నమ్మ అన్నారు. పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలో బుధవారం మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 12వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో చిన్నారులందరికీ వైద్యశాఖ ద్వారా వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. అప్పుడే పుట్టిన పిల్లలనుంచి ఐదు సంవత్సరాల పిల్లలను ముందుగా గుర్తించి వారికి వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. వార్డు హెల్త్ సెక్రటరీ సీహెచ్ శివనాగమల్లేశ్వరి మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలను సచివాలయంలో వేయడం జరుగుతుందన్నారు.

జగనన్న కాలనీలో మెరక పనులు



సత్తెనపల్లి: మండలంలోని గర్నెపూడి గ్రామంలో గల జగనన్న కాలనీలో ఎత్తు పల్లాలు ఉండటంతో మెరక చేపట్టే పనులను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయ భాస్కర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. గృహ నిర్మాణాలకు అనువుగా ఉండేలా పొక్లెయిన్‌తో పనులు చేయించారు. సర్పంచ్ గుగ్గిలం అంకమ్మ, నాయకులు కాశిమాల ఓబయ్య, కాసిమాల మార్క్, కాసిమాల గోవర్ధన్ రావు, కాశిమాల ఇస్మాయిల్, కాశిమాల కోటయ్య, కొరివి శాంతారావు, తురిమెళ్ళ దేవా సహాయం ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వినుకొండ (నూజండ్ల): విజిలెన్స్ అధికారుల దాడులలో భాగంగా తలార్లపల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ములకలూరు, చెన్నారెడ్డి కాలనీ, వినుకొండ మండలంలోని గోనుగుంట్లవారిపాలెం నుంచి 63.50 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్న రెండు ఆటోలను, డ్రైవర్లు కె. నాగరాజు, జాన్‌మౌని, ఏజెంట్లు మురళికృష్ణ, వెంకయ్యలను అదుపులోకి తీసుకొని, ఐనవోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

14 వరకు రైల్వే గేట్ల మూసివేత

నాదెండ్ల: సాతులూరు నుంచి కనపర్రు వెళ్లే, సాతులూరు నుంచి బుక్కాపురం వెళ్లే డొంక రోడ్లలో ఉన్న రైల్వే గేట్లను ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకూ మూసివేస్తున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. ఈమేరకు రైల్వే అధికారుల నుంచి బుధవారం తమకు ఆదేశాలు అందాయని తెలిపారు. గుంటూరు–గుంతకల్లు డబుల్ లైన్ నిర్మాణ పనులు, మరమ్మతుల దృష్ట్యా రెండు రైల్వే గేట్లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తెలిపారు. సాతులూరు నుంచి చందవరం వెళ్లే రైల్వే గేటు యధావిధిగా పనిచేస్తుందని తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తికావాలి


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న రవిబాబు

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని నూజెండ్ల మండల ప్రత్యే కాధికారి, వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజ్ క్లినిక్, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం, పాఠశాలలో నాడు–నేడు పనులను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గర్భిణుల వివరాలు, స్కూల్‌లో బలహీనంగా, తక్కువ బరువు ఉన్న పిల్లల వివరాలను తప్పనిసరిగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేసి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామంలో జరుగుతున్న ఫామిలీ డాక్టర్ కార్యక్రమంపై ఆరా తీశారు. అనంతరం ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఏఈవో ఎల్.ఎలీషా, పంచాయతీ కార్యదర్శి చెన్నారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

బొల్లాపల్లి: సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌లో భాగంగా మండలంలోని బొల్లాపల్లి, వెల్లటూరు గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం అధికారులు సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి రుచి చూశారు. నాడు–నేడులో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్స్‌ను, పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ నాడు–నేడులో పలు పాఠశాలల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు నాణ్యతతో పాటు రుచికరంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రీ స్కూల్ యాక్టివిటీస్ నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా, పీఆర్ ఏఈ అల్లాభక్షు, ఎంఇఓ 2 కె. పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఎండుగుంపాలెంలో గ్రామోదయం

నాదెండ్ల: మండలంలోని ఎండుగుపాలెం గ్రామంలో బుధవారం అధికారులు గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత మనబడి నాడు నేడు పనులు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత పరిశీలించి పథకం నిర్వాహకులకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా సచివాలయ సిబ్బంది పనిచేయాలని సూచించారు.

చర్మకారుల అభ్యున్నతికి సహకరించాలి

శావల్యాపురం:మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో చర్మకార సేవ సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో చర్మకారులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు మండల అధ్యక్షులు కాకాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు మల్లావరపు రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో మాదిగల అభ్యున్నతికి సంక్షేమానికి ఉపాధి కల్పనకు రూ. 65 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పత్రికల ద్వారా సమాచారం ఇవ్వటం మంచి శుభాపరిణామమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ చర్మకారుల అధ్యక్షులు జుంజు యేహాను, రావినూతల శ్యాంసోన్, ఏసోబు, గూడూరి రోశమ్మ, గండి నాగేశ్వరరావు,గొల్లయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.


పారదర్శకంగా సేవలు అందించాలి

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో స్వయంసహాయక మహిళా సభ్యులకు అవగాహన కార్యక్రమం వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయం అధికారులు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీయం జి.వాసుబాబు పాల్గొని మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, జగనన్న తోడు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలన్నారు. సర్పంచ్ జ్యోతి, సీసీ ఖాజావలీ, వీవోఎలు యానిమేటర్లు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారిణికి ట్రిపుల్‌ఐటీ సీటు

నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ స్కూలుకు చెందిన రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో టీం క్రీడాకారిణి, పదో తరగతి విద్యార్థిని ఎం.జ్ఞానశివపార్వతి నూజివీడు ట్రిబుల్ ఐటీలో సీటు సాధించారు. ఆ విద్యార్థినికి స్పోర్ట్స్ కోటాలో సీటు లభించింది. శివపార్వతికి పదో తరగతి పరీక్షల్లో 535 మార్కులు కూడా సాధించింది. ఈ మేరకు ప్రతిభ కల్గిన ఆ విద్యార్థినీని ఆజాదీకా మహోత్సవ్‌లో బాగంగా లింగంగుంట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆ విద్యార్థినికి దుశ్శాలువ కప్పి సత్కరించి అభినందించారు. అలాగే పీడీ ఝాన్సీ రాణి, క్రీడాకారిణి శివపార్వతీని జిల్లా ఖోఖో అసోసియేషన్ తరఫున ప్రతినిధులు అభినందనలు తెలియచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్‌వీ రమణా నాయక్, పొన్నపాటి ఈశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచు పొన్నపాటి విజయకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 12,13 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్. వీరాంజనేయచౌదరి కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల్లో న్యాయపరమైన విషయాలు, న్యాయవాద వృత్తిలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, దేశంలో రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు సీహెచ్.ఎల్.ఎన్.మూర్తి, జిల్లా అధ్యక్షులు సయ్యద్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సలీం, జిల్లా ఉపాధ్యక్షులు శేషగిరిరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కాన్పులు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలి


గర్భిణితో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శోభారాణి

రాజుపాలెం: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రతీ నెల మూడు కాన్పులు అయ్యే విధంగా సిబ్బంది చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శోభారాణి సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా బుధవారం తనిఖీలు నిర్వహించారు. ప్రతీ నెల 9,10 తేదీలలో జరిగే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వం అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు అందించే సేవలను, ల్యాబ్‌లో జరిగే పరీక్షలు, రికార్డులను పరిశీలించి, కొన్ని సందేహాలను వ్యక్తం చేస్తు సూచనలు ఇచ్చారు. రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగాజిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ రోజువారిగా జరిగే ఓపీలను పెంచాలని, కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అపరమత్తంగా ఉండాలని తెలిపారు. రక్త హీనత ఉన్న గర్భిణులను, కిశోర బాలికలను గుర్తించి వారికి ఐరన్, ఫోలిక్ బిళ్లలు, ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్‌లను ఇవ్వాలని తెలిపారు. అనంతరం గణపవరం గ్రామ సచివాలయం–2లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్‌ను పరిశీలించారు. ఆమె వెంట డాక్టర్ వెంకటకృష్ణకుమార్, డాక్టర్ రవితేజ నాయక్, సూపర్‌వైజర్లు, జీవన్‌రావు, ఉషారాణి, గ్లోరీ, సిబ్బంది ఉన్నారు.

పత్తిలో రసంపీల్చే పురుగులను నివారించాలి


కోనూరులో పత్తి రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

అచ్చంపేట: పత్తిపంటలో మొక్క ప్రారంభదశలో వచ్చే రసం పీల్చే పురుగులను గుర్తించి తక్షణమే నివారించాలని, లేకుంటే పంట దిగుబడి తగ్గే అవకాశాలున్నాయని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని కోనూరులో బుధవారం ఆయన పత్తిపంటలను పరిశీలించి రసం పీల్చే పురుగులను గుర్తించారు. రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల ఆధారంగా పత్తిపంటలో రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, తామర పురుగు, పేనుబంక, పచ్చదోమల తాకడికి మొక్క ఆకులు ముడుచుకోనిపోవడం, ఎండిపోయిరాలిపోవడం జరుగుతుందన్నారు. అలాంటి పరిస్థితులలో రైతులు వెంటనే మోనోక్రోటోఫాస్ 1.6ఎంఎల్, అసిఫేట్ 2 గ్రాములు, లేదా అసెటిమిప్రిడ్ 1 గ్రాము, లీటర్ నీటితో కలిపి మొక్క బాగా తడిసే విధంగా పిచికారి చేయాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే కంది విత్తనాలను పత్తిపంట పొలంగట్లపై, అంతర్‌పంటగా కందిసాళ్లు వేసుకోవాలని చెప్పారు. వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకుడు షరీఫ్, రైతులు పాల్గొన్నారు.

12న ధర్నాను విజయవంతం చేయాలి



సత్తెనపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎస్ఎం సుభాని పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో బుధవారం సత్తెనపల్లి, రాజుపాలెం, ముప్పాళ్ల, బెల్లంకొండ, మండలాల ఫ్యాప్టో ఉపాధ్యాయుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ వైఖరి, సీపీఎస్ రద్దు, బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల విడుదల చేయడం, పెండింగ్ బకాయిలు విడుదల చేయడం, 117 జీఓను రద్దు చేయడం, 12వ పీఆర్సీ తక్షణమే అమలు చేస్తూ 11వ పీఆర్సీలో జరిగిన నష్టాన్ని నివారిస్తూ 50 శాతం ఐఆర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు ఎం.శ్రీనివాసరావు. డి.కిషోర్, షేక్ ఇబ్రహీం, ఎస్ఎం రహమాన్, గార్లపాటి సునీల్ బాబు, ఐతమ్ రాజు, షేక్ సుబ్బు, ధర్మారావు, సురేష్, బొర్రా శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, టి.రాజు, నజీర్, సిహెచ్ వెంకటేశ్వర్లు, అచ్చయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ఫణిదంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న మండల ప్రత్యేక అధికారి సుధాకర్

సత్తెనపల్లి: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రత్యేక అధికారుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి సుధాకర్ చెప్పారు. సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక అధికారుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పలు అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ వేమవరపు బుల్లిబాబు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు ఉన్నారు.

100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

నాబార్డు ప్రతినిధులతో కలసి పరిశీలించిన ఎమ్మెల్యే బొల్లా


స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం రెవెన్యూ, ఎన్ఎస్‌పీ, నాబార్డు ప్రతినిధులతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌పీ కాలనీలో 5 ఎకరాల విస్తీర్ణంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి మార్గం సుగమమైందని, పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో ఆస్పత్రి నిర్మాణాలతో పాటు ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అన్ని అనుమతులు మంజూరు చేసిందని, త్వరలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. నాబార్డు ఆర్థిక సాయంతో ఆస్పత్రి నిర్మాణం చేసేందుకు బ్యాంక్ ప్రతినిధుల బృందం కూడా స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలోని పాత ఆస్పత్రి భవనంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో వినుకొండ నియోకజవర్గ ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెస్తామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో ఇప్పటికే పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు ప్రభుత్వ వైద్యశాలకు అనుగుణంగా 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వినుకొండ పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, వార్డు కౌన్సిలర్ షకీలా దస్తగిరి, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎన్ఎస్‌పీ డీఈ నందిగం రాజన్‌లతో పాటు నాబార్డు ప్రతినిధులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.